# అపాత్ర దానం

సాయంత్రం ఏడు గంటలు.

బస్‌స్టేషన్ చాలా రద్దీగా వుంది. పేరుకు జిల్లా హెడ్ క్వార్టర్సేగానీ ఒక మారుమూల పల్లెకన్నా అధ్వాన్నంగా వుందక్కడ మెయింటెనెన్సు.

ఎటు చూసినా జనం ఇష్టం వచ్చినట్టు కేకలు వేయడం, నిర్లక్ష్యంగా పరుగులు తీయడం, నోట్లో సిగరెట్టో, బీడీయో పెట్టుకుని గుప్పుగుప్పుమని పొగ వదులుతూ వుండడం.. మొత్తానికి ఎంతో ఛండాలంగా, మరోసారి బుద్ధి అనేది వుంటే ఈ ప్రాంతానికి రాకూడదనేలా వుంది అక్కడి పరిస్థితి.

ఆరు గంటల నుండి ఎదురుచూస్తోంది మౌనిక తనక్కావలసిన బస్ రాకకోసం. కానీ బస్సు జాడే లేదు. ఎంతో విసుగ్గా, చిరాగ్గా తల విదిలిస్తోంది. పక్కనే కూర్చుని వీక్లీ తిరగేస్తున్న మిధిల.."అబ్బ ఏంటే నీ బాధ...వస్తుందిలే బస్సు..కొంచెం కంట్రోల్ చేసుకో" అంది.



మిథిలని మింగి పారేస్తానన్నంత కోపంగా చూసింది మౌనిక.

"ఎంత అసహ్యంగా వుందో తెల్సా ఇక్కడ! ఆ శిల్ప పుట్టినరోజు ఏదో కాలేజీలోనే చేసుకోక. ఇంటి దగ్గర పెట్టుకుని ఇంత ప్రాబ్లమ్ తెచ్చింది. ఈ టైమ్‌లో నాకు బస్సు దొరకాలంటే ఎంత కష్టం తెల్సా? అక్కడ మా డాడీ ఎంత కంగారు పడుతున్నాడో ఏమో.." అంది మౌనిక ఎంతో బాధగా.

"ఫోన్ చేశావుగా...ఇంకెందుకు బాధ!"

"ఫోన్ చేసినా టెన్షన్ వుండదా ఏం!"

ఇంతలో మౌనికపక్కగా ఏదో అలికిడైనట్టనిపించి తల తిప్పి చూసింది. ఎవరో సన్యాసిలాగున్నాడు. తల ఎత్తి అతన్ని ఆపాదమస్తకం ఓ క్షణం పరిశీలనగా చూసింది.

మనిషి యాభై ఏళ్లవాడై వుండొచ్చు. తెల్లగడ్డం, బట్టతల..కాషాయరంగు బనియను, లుంగీ ధరించాడు..ముష్టివాడే! అయితే ఒక కాలికి ఏదో ప్రాబ్లెమ్ వున్నట్టుంది. మొత్తానికి వికలాంగుడని తెలుస్తోంది.

నిశ్చలంగా చేయి ఆమె మొహం మీదకి చాచి ఎదురు చూస్తున్నాడు.

క్షణం ఆలోచించింది మౌనిక.

వెంటనే పర్సు తెరచి చిల్లర వెదికి రూపాయి కాయిన్ తీసి అతడి చేతిలో వేసింది. అతడు ముందుకి కదిలాడు.

"వాడికెందుకే రూపాయిచ్చావు?" కసిరినట్టుగా అడిగింది మిధిల కోపంగా.

"అరె..పోనీవే..వికలాంగుడు..పైగా పెద్దమనిషి ఇస్తే ఏం?" అంది మౌనిక.

"నీకసలు బుద్ధిలేదు. వాడు చూడు ఎలా వున్నాడసలు? వూరికే అలా వచ్చి చేయి చాచి నిలబడగానే రూపాయిస్తావా... ఎందుకలా డబ్బుని వృధా చేయడం? రూపాయి వూరికే వస్తుందా? ఇప్పుడు బస్సులో నీ టికెట్‌కి రూపాయి తక్కువైతే కండక్టరు అవమానించి దింపేయకుండా వూరుకుంటాడా?" తీక్షణంగా చూసింది మిధిల.

"అబ్బ...చిన్న విషయానికి అంత ఇరిటేట్ అవుతావేంటీ? ఏదో పాపం వికలాంగుడు..పుణ్యమే కదా! మనల్ని మనసులో ఆశీర్వదిస్తాడు"

"ఇప్పుడు నిన్ను ఆశీర్వదించాడనే నువ్వనుకుంటున్నావా?"

"అవును"

"నీ మొహం"

"ఏయ్ ఏంటే అలా అంటావ్!"

"నీకర్థం కాదులే గానీ..అదుగో బస్సు వచ్చేసింది..పద తొందరగా ఎక్కేద్దాం."

ఇద్దరూ ఆ పనిలోపడ్డారు. రెండు నిముషాల తర్వాత సీట్లలో సర్దుకుని కూర్చున్నారు.

ఈలోగా మరో నాలుగు బస్సులు బస్టాండులోకి ప్రవేశించాయి. అవన్నీ వివిధ మండల కేంద్రాలకు వెళ్లవలసిన బస్సులు కావడంతో జనం వాటిపై విరగబడ్డారు.

అంతా తొక్కిసలాట..కేకలు..అరుపులు..

వచ్చిన అన్ని బస్సులూ జనంతో నిండిపోతున్నాయి.

"ఏంటే అలా వున్నావు? దేని గురించి ఆలోచిస్తున్నావు?" అని అడిగింది మిధిల..మౌనిక మొహంలో విషాదాన్ని గమనించి.

"ఏం లేదు" అని కిటికీలోంచి బయటికి చూడసాగింది.

"ఇంతకు ముందు నిన్నవసరంగా తిట్టాననా?" మౌనిక మాట్లాడలేదు.

మిధిల ఒక నిట్టూర్పు విడిచింది. తనకి సారీ చెప్పి పూరడిద్దామని అనుకుంది గానీ అంత తప్పు తనేం చేయలేదని వూరుకుంది.

డ్రైవరు, కండక్టరు ఇంకా బస్సు ఎక్కలేదు.

అంతలో ఆ ముష్టివాడు బస్సెక్కాడు. ఒక్కొక్కరి వద్దకు వస్తున్నాడు.

మౌనిక, మిధిల అతని వంక చూడసాగారు.

అదేమిటో ఎవరూ అతనికి డబ్బులు విదల్చడం లేదు. వాళ్ల ముందు వరుసల్లోని వాళ్లంతా భారీ మనుషులు. ఆ ముష్టివాడిని అస్సలు పట్టించుకోకుండా, తల కూడా తిప్పకుండా చేత్తోనే "వెళ్లు" అన్నట్టుగా సైగ చేస్తున్నారు. కొంతమంది అసహ్యంగా చూసి తల తిప్పుకుంటున్నారు.

అతను ఒక్కొక్కర్ని అడిగి లేదనిపించుకుంటూ...కొద్దిసేపటికి మౌనిక వద్దకి వచ్చి చేయి చాపాడు.

మౌనిక కూడా చేత్తో 'వెళ్లు' అన్నట్టు సైగ చేసింది.

'ఇంతకు ముందే ఇచ్చాను కదా' అని చెప్పాలనుకునీ..అంతమందిలో అలా అతడితో మాట్లాడ్డం ఇష్టం లేక పొమ్మన్నట్టుగా చేయి వూపింది..కాస్త విసుగ్గా.

అతడు ఉన్నట్టుండి నిప్పులు కురిపిస్తున్నట్టుగా ఉగ్రంగా చూశాడు మౌనిక వైపు.

"లేవా? డబ్బులే లేవా? లేకుండానే బస్సుల్లో తిరుగుతున్నారా? సినిమాకీ, షికార్లకైతే వస్తాయా?" అంటూ హేళనగా అడిగాడు.

మౌనిక బిక్కమొహం వేసింది. ఇంతకుముందు తన దగ్గర రూపాయి తీసుకునీ..తనని గుర్తుపట్టడం లేదనే సంగతి మౌనికకి షాక్‌లా అనిపిస్తోంటే మాట రాక అలా బిత్తరచూపులు చూస్తుండిపోయింది.

ఆ ముష్టివాడు అలా తిడుతూనే బస్సు దిగి వెళ్లిపోయాడు.

మౌనికకి తల తీసేసినంత అవమానంగా అనిపించింది. అకస్మాత్తుగా తన కళ్లలో నీటిపొర.

మిధిల మౌనిక భుజం మీద చేయి వేసింది ఓదార్పుగా.

చిరునవ్వుతో మౌనిక వైపు చూస్తూ అంది.

"చూశావుగా...నీ మొహమే వాడికి గుర్తులేదు. డబ్బు తీసుకుని వెళ్లిపోవడం తప్ప వాడికి మరో ఆలోచన లేదు. అలాంటి స్వార్థపరుడు నిన్ను దీవించాడని ఎలా అనుకోగలవు చెప్పు"

"నువ్వు చెప్పిందే కరెక్ట్ మిధిలా...నేను నా అభిప్రాయాల్ని మార్చుకోవాల్సిన అవసరం వుంది" అంది మౌనిక..రెండు క్షణాల మౌనం తర్వాత.

**-తోపుగుంట మస్తాన్‌బాబు (నెల్లూరు)**